


## జరిగిన జగన్నాటకం

ఎడమచేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు దళాధిపతి మరణదండన విధించబోతే ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. ద్వీపాన్ని వదిలి వెళ్ళిపోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు బోసు. భవిష్యజ్ఞాన గ్రంథంలో చెప్పబడిన మహాబసు బోసే అని ద్వీప చెప్పింది. దళాధిపతితో జరిగిన పోరాటంలో జలపతి మరణించాడు. అయిష్టంగానే నాయకత్వాన్ని మహాబసుకి ఇచ్చేశాడు ఉగ్ర. శాంతియుత పోరాటం ఆరంభమైంది. సవ్యలంక మహాధినేత వామదేవుడు నూటాఇరవై మంది సత్యోద్యమకారులను హతమార్చి, మహాబసు స్పృహతప్పేలా గాయపరిచాడు. మహాబసు తన వైఫల్యాన్ని అంగీకరించి ఉద్యమ నాయకత్వం నుంచి తప్పుకుంటానని ప్రకటించాడు.

# -12-

ఉగ్ర మాట్లాడటానికి సిద్ధపడుతూ ఒకసారి ఎదురుగా వున్న జనాన్ని పరికించి చూశాడు. ఏడువందల మంది వుండచ్చని అతనికి అనిపించింది. వారంతా కుడిచేతి వాడకాన్ని సమర్థిస్తూ మహాబసు నాయకత్వం మీద నమ్మకంతో సత్యోద్యమ పోరాటానికి సిద్ధపడినవాళ్ళు. వారంతా మహాబసు నాయకత్వ బాధ్యత నుంచి తప్పుకుంటానని ప్రకటించడంతో హతాశులై, ముందు ముందు ఏం జరగబోతోందా అని ఆందోళనగా వున్నారు. వాళ్ళ తిరుగుబాటుని అక్కడే అణిచివెయ్యడానికి దళాధిపతి సైన్యం వారి వెనుకే నిలుచోని వుందన్న సంగతి ఇంకా ఎవరూ గమనించలేదు. అలాంటి పరిస్థితిలో ఎలా మాట్లాడాలా అని కొన్ని క్షణాలు ఆలోచించాడు ఉగ్ర.

"మహాజనులారా! సత్యోద్యమ కార్యకర్తలారా!" అని మరో క్షణం ఆగాడు. "నాయకత్వాన్నిపరిత్యజించి మహాబసు నన్ను నాయకుడిగా నిలబడమని ఇచ్చిన సూచనను నేను మీ అందరి ముందే తిరస్కరిస్తున్నాను." అన్నాడు గట్టిగా.

ఒక్కసారిగా ఎదురుగా ఉన్న జనంలో నిరాశ నిట్టూర్పుల రూపంలో, "వద్దు వద్దు" అన్న కేకలలో స్పష్టంగా వినపడింది. వాళ్ళందరినీ ఆగమన్నట్లు సైగ చేశాడు ఉగ్ర.

"మహాధినేత వామదేవుడికి వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టిన వాణ్ణి నేను కాదు. నా కన్నా ముందు కూడా అనేకమంది అతని విధానాలను వ్యతిరేకిస్తూనే వున్నారు. అయితే నేను నాయకుడిగా ఎదిగిన తరువాత పదుల సంఖ్యలో కొంత మంది నాకు మద్దత్తు తెలిపారు. ఆ ఇరవై ముప్ఫై మందితో నేను ఎడమచేతికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించాను. మహాబసు వచ్చే వరకు ఆ పోరాటం బాగానే సాగింది. ఎంతోమంది మతాధికారులను హతమార్చాను. మరెంతో మంది రాజ్యాధికార సైనికులను మట్టుపెట్టాను. అంతా సరైన దిశగా సాగుతోందన్న నమ్మకం నా అనుచరులలో కలుగుతున్నప్పుడు మహాబసు వచ్చాడు. భవిష్యజ్ఞాన గ్రంథం ప్రకారం మహాబసే ఈ పోరాటానికి నాయకుడిగా వుండాలని ఆచార్య వేదాంతం లాంటి వాళ్ళు చెప్పడంతో నేను వైదొలిగాను. అయిష్టంగానే మహాబసుకే అధికారం ఇచ్చాను. అలాంటి అధికారాన్ని ఇప్పుడు మహాబసు తిరిగి నాకే ఇచ్చేస్తానంటున్నాడు." అని ఒక్క క్షణం జనానికి వెనుకగా వున్న దళాధిపతి సైనికులని చూశాడు. ఉద్యమంలో ఆధిపత్యం కోసం గొడవ జరుగుతోందని అర్థం అయినట్లు వారిలో వారే నవ్వుకుంటూ మాట్లాడుతున్నారు. ఉగ్ర కూడా ఒక చిరునవ్వు నవ్వి కొనసాగించాడు.

"నిజానికి మీ అందరి సమక్షంలో మహాబసు నాయకత్వాన్ని సమర్థిస్తున్నానని చెప్పడానికే మీ ముందుకు వచ్చాను" అన్నాడు. ఆ మాట విని మొదట ఆశ్చర్యపోయిన వాళ్ళు సైనికులు. ఆ తరువాత మహాబసు. ఉగ్ర మహాబసు వైపు తిరిగి చెప్పసాగాడు.

"మహాబసూ... ఇన్న సంవత్సరాల నా పోరాటంలో నాతో కలుపుకున్నది ముప్ఫై ఏడుమందిని. కానీ నువ్వు పోరాటం మొదలుపెట్టి ఈ నాడు ఈ సభకి పిలిస్తే ఇన్ని వందల మంది వచ్చారు. నాయకుడిగా వాళ్ళకి నీపైన నమ్మకం కల్పించగలిగావు. నీ హయాములో తప్పకుండా విజయం సాధించగలమని వీళ్ళంతా విశ్వసించి మన వెంట నడిచారు. పైగా ఇక్కడ అందరికీ తెలిసిన సాయుధపోరాటాన్ని కాదని శాంతి, ధర్మం ఆధారంగా ఉద్యమం చెయ్యాలని నువ్వు చెప్తే అది అంత నమ్మదగినదిగా నాకు అనిపించలేదు. కానీ ప్రజలు నమ్మారు. నాయకుడిగా నువ్వే వుండాలని చెప్పడానికి ఇంతకన్నా ఇంకేం ఉదాహరణ కావాలి? ప్రజలు నమ్మినవాడే నాయకుడు. నువ్వు అలాంటి నాయకుడివి. అందుకే నేను నాయకుడిగా వుండాలన్న ప్రతిపాదనని తిరస్కరించాను" అన్నాడు. ప్రజలు చప్పట్లతో తమ హర్షాన్ని ప్రకటించారు.

"అయితే మహాబసు చెప్పిన యుద్ధప్రణాలిక కారణంగా నూటాఇరవై మంది ప్రాణాలు కోల్పోయారు. నైతికంగా అతని బాధ్యత లేదా అని మీరు ప్రశ్నించవచ్చు. అతని యుద్ధం వ్యూహంలో నాకు ఎలాంటి తప్పు కనపడలేదు. పైగా అందులో వున్న సిద్ధాంతం నాకు

ఎంతో విస్మయాన్ని కలిగించింది. ధర్మం ఆయుధంగా మార్చడం అతని గొప్పతనం. పోరాటంలో శత్రువుని ఏమీ చెయ్యకుండా కేవలం మొండితనంతో తిరుగుబాటు చెయ్యడం ఒక అద్భుతమైన ఆలోచన. బలవంతులైన వామదేవుడి సైన్యంతో ప్రత్యక్ష పోరాటానికి దిగితే ఇంత మంది సహకారం లభించేది కాదు. ఆ పోరాటంలో వామదేవుడే గెలిచే అవకాశం వుంది. కానీ ఇలాంటి సత్యోద్యమంలో వామదేవుడు గెలువలేడు. అంటే బలవంతుడైన శత్రువుని బలహీనుడు గెలిచేందుకు కావాల్సిన యుద్ధ వ్యూహాన్ని మహాబసు ఊహించగలిగాడు. ఇది నాయకుడిగా అతని అద్భుత ప్రతిభకు నిదర్శనం.

"అయితే ఈ యుద్ధం వ్యూహం విఫలమైన మాటకూడా నిజమే. కానీ అందుకు కారణం ఆ వ్యూహంలో వున్న లోపం కాదు. కేవలం శత్రువు కర్కశత్వాన్ని తక్కువగా అంచనా వెయ్యటం. అదే వామదేవుడి బదులు ఇంకెవరైనా వుండి వుంటే ఈ ఉద్యమ పథకం దిగ్విజయంగా ముగిసేది. బలహీనుడైన వ్యక్తి ధర్మం ఆధారంగా అహింస అనే ఆయుధంతో యుద్ధం చేస్తుంటే, అలాంటి వాడిని ఏం చెయ్యాలో బలవంతుడికి అర్థం కాదు. అలా అర్థం కాని పరిస్థితుల్లో బలవంతుడు బలహీనుడి దగ్గరకు కాళ్ళ బేరానికి రావాల్సి వుంటుంది. మొండికేసిన పిల్లాడు అన్నం తినకుండా మారాము చేస్తే ఒక పూటకి కాకపోతే మరో పూటకైనా తండ్రి పిల్లాడి కోరికను అంగీకరించక తప్పదు. అందుకే ఉద్యమం మొదలైన తరువాత వరుసగా విజయాలు సాధించాము. ఏం చెయ్యాలో తెలియని స్థితిలో దళాధిపతి సైన్యం వెనక్కి తగ్గడం చూశాము. ఇవన్నీ మహాబసు యుద్ధం ప్రణాళిక వల్ల కలిగిన విజయాలే. ఈ విషయాన్ని వామదేవుడు అర్థం చేసుకున్నాడు. అందుకే నరమేధం చేసి మన మీద మనకు, మన పోరాట వ్యూహం మీద నమ్మకం పోయాలా చెయ్యాలని అనుకున్నాడు. అందుకే దాక్షిణ్యరహితంగా సాధారణ కార్యకర్తల పై దాడి చేసి మారణహోమం చేశాడు. జాగ్రత్తగా గమనిస్తే వామదేవుడు మన ఉద్యమాన్ని చూసి భయపడ్డాడన్న సంగతి స్పష్టంగా కనపడుతోంది. ఇదే మహాబసు సాధించిన గొప్ప విజయం. అవునా? కాదా?" అంటూ అరిచాడు ఉగ్ర.

"అవును... అవును.." అంటూ ప్రజలంతా అరిచారు.

"ఇన్ని సంవత్సరాలుగా నేను చేస్తున్న పోరాట పథకం సరైనది అయితే అయ్యుండచ్చు. కానీ నేను వామదేవుడు భయపడేంతలా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళలేకపోయాను. అది సాధించిన మహాబసు నిజమైన నాయకుడు. అవునా? కాదా?" అంటూ మళ్ళీ అరిచాడు ఉగ్ర.

"అవును... అవును..." ఈసారి మరింత గట్టిగా అరిచారు ప్రజలు. వారి వెనుక వున్న సైనికులలో కలవరం మొదలైంది.

"మనకు మహాబసే నాయకుడు. ఇప్పుడు జరిగిన పరిణామాల వల్ల ఆయన యుద్ధ వ్యూహాన్ని మార్చవచ్చు. లేదా సత్యోద్యమం అదే రూపంలో కొనసాగవచ్చు. ఏది జరిగినా మహాబసు చెప్పినదే మనం చేద్దాం. భవిష్యజ్ఞాన గ్రంథం చెప్పిన కుడిచేతి వీరులు విజయం మనం అదుకునేంత దగ్గర్లో వుంది. దాన్ని అందుకోడానికి కావాల్సింది మహాబసు నాయకత్వమే. ఒప్పుకుంటారా?" గట్టిగా అరిచాడు మళ్ళీ.

"ఒప్పుకుంటున్నాం... ఒప్పుకుంటున్నాం" అన్నారు కొందరు. "మహాబసే మన నాయకుడు" అంటూ అరిచారు ఇంకొందరు.

మళ్ళీ మహాబసు వైపు తిరిగాడు ఉగ్ర.

"మహాబసు... ప్రజలు కోరుకుంటున్నారు. నేను, నా లాంటి వారు, ఆచార్య వేదాంతం మేమంతా నువ్వే నాయకుడివని నమ్ముతున్నాము. నువ్వు చెప్పబోయే ప్రతి మాట శిరసావహించి నిర్వహించడానికి సిద్ధంగా వున్నాము. చెప్పు ఏం చెయ్యాలో..." అంటూ పక్కకి తప్పుకున్నాడు.

మహాబసు లేచి నిలబడ్డాడు.

"మహాబసు... మహాబసు" అంటూ ప్రజలంతా దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తున్నారు. వారి వెనుకు నిలబడ్డ దళాధిపతి సైన్యంలో ఇద్దరు వెనక్కి నడిచి, చెరో గుర్రం ఎక్కి రాజధాని వైపు సాగిపోయారు. అంటే మరో కొన్ని నిముషాలలో మరింత మంది సైన్యం రావచ్చు. దళాధిపతి రావచ్చు. లేదా స్వయంగా వామదేవుడే మళ్ళీ వచ్చి మరో నరమేధం జరిపించవచ్చు. "అలా జరగకూడదు" అనుకున్నాదు మహాబసు.

"నా మీద మీరు ఉంచుకున్న నమ్మకానికి నేను కృతజ్ఞుణ్ణి. ఉగ్ర చెప్పింది నిజమే. క్రూరత్వానికి పరాకాష్టగా వామదేవుదు వచ్చి నా సిద్ధాంతాన్ని బ్రద్దలు చేశాడు. అదే అతని స్థానంలో సాత్వికుడై శత్రువు వుండి వుంటే బహుశా మనం గెలిచేవాళ్ళమేమో. పరిస్థితులు ఒక సిద్ధాంతానికి అనుకూలంగా లేకపోయినా అర్థంలేకుండా అవే సిద్ధాంతాలను పట్టుకోని వేలాడటం అవివేకమే అవుతుంది" అలా అంటున్నప్పుడు ఆ మాటలు అంతకు ముందు గాంధీ చెప్పిన మాటలుగా గుర్తుకొచ్చాయి. మహాబసు నవ్వాడు.

"అందువల్ల నేను ప్రతిపాదించిన సత్యోద్యమ వ్యూహాన్ని వెనక్కి తీసుకుంటున్నాను. దుర్మార్గుడైన వామదేవుణ్ణి ఎదిరించడానికి సాయుధపోరాటమే సరైనదని మీ అందరి ముందు ఒప్పుకుంటున్నాను. కౄరత్వానికి సమాధానం అయుధంతోనే చెప్పాలి. ఇన్నాళ్ళుగా శిక్షలతో భయపెడుతూ, అనుక్షణం మీ ప్రతి అడుగునీ శాసిస్తూ సాగిన ఈ నిరంకుశ నియంతృత్వం ఇకపై సాగదని ప్రకటిద్దాం. సవ్యలంకలో అందరూ సవ్యమైన చేతినే వాడేట్లు చేస్తామని, ఈ ద్వీప పరిరక్షణ చేస్తున్న సముద్రం సాక్షిగా ప్రమాణం చేద్దాం.

"ఇందులో మీ ప్రాణాలు పోవచ్చు, నా ప్రాణం పోవచ్చు. కానీ మన ప్రాణాలకన్నా ముఖ్యమైన ఆశయం కోసం పోరాటం చెయ్యడానికి సిద్ధమౌదాం. మనకోసం కాదు. మన తరువాత రాబోయే తరాలకోసం, మన బిడ్డల కోసం, వారి బిడ్డల కోసం. ముందు ముందు ఈ గడ్డపై పుట్టే ప్రతి ప్రాణి అన్ని ముఖ్యమైన సందర్భాలలో కుడిచేతినే వాడటం కోసం మనం ఉద్యమిద్దాం. అవసరమైతే మన రక్తాన్ని ధారపోసైనా కొత్త చరిత్రకు మొదటి అధ్యాయం రాద్దాం." అంటూ ఆవేశంగా అరిచాడు మహాబసు.

అప్పటికే అతని ఎదురుగా వున్న ప్రజలు ఆవేశంతో ఊగిపోతున్నారు. ముఖాలు ఎర్రబడ్డాయి. బలంగా ఊపిర్లు వదులుతున్నారు. మహాబసు ఆఖరి మాటలు వినగానే ఒక్క ఉదుటున కుడిచేతి పిడికిలి పైకెత్తి "జయహో మహాబసు... జయహో మహాబసు" అంటూ నినాదాలు చేశారు.

"ఈ పోరాటినికి నాంది ఇక్కడే జరగాలి. ఈ క్షణమే ప్రారంభం కావాలి. అదిగో దళాధిపతి సైన్యం. మీ తోటి ఉద్యమకారుల్ని చంపిన వామదేవుడి సైన్యం. శాంతియుతంగా సాగిన పోరాటాన్ని రక్తమయం చేసిన అధికారానికి ప్రతినిధులు. అదిగో అదే మీ సోదరులు, మీ బిడ్డల, మీ స్నేహితుల రక్తంతో తడిసి, మనల్ని సాయుధులుగా రమ్మని సవాల్ విసిరిన రాజ్యాధికారం. రక్తానికి సమాధానం రక్తంతో ఇద్దాం. అధికారానికి సమాధానం ధిక్కారంతో ఇద్దాం. మీ వెనక వున్న సైనికులే ఈ యుద్దానికి మొదటి బలి కావాలి. విజృంభించండి" కుడిచేతి పిడికిలిని బిగించి పైకెత్తి అరిచాడు మహాబసు.

ప్రజలందరూ "జయహో మహాబసూ" అంటూ వెనక్కి తిరిగారు. సైనికులలో కలకలం బయల్దేరింది. అందరూ ఒక్క చోటికే చేరారు. ఎదురుగా వున్న ఏడొందలమంది ప్రజల ఆవేశం వాళ్ళకి ఆలోచించుకునే అవకాశం కూడా ఇవ్వటం లేదు. తాము గుర్రాలమీద వున్నామని, నడుముకి కట్టిన ఒరలలో కత్తులు వున్నాయని మర్చిపోయారు. ఆ విషయాన్ని గుర్తించేలోపలే ప్రజలంతా వాళ్ళని చుట్టు ముట్టారు. దళాధిపతికి విషయం చేరవేసేందుకు వెళ్ళిన ఇద్దరు సైనికులు వస్తారేమోనని అటు దిక్కుగా చూశారు. అటు నుంచి వస్తున్న గుర్రాలపై ఉగ్ర అనుచరులను చూసి ఆశ్చర్యపోయారు. ఆ గుర్రాలకు కట్టి నేలను ఈడ్చుకుంటూ వస్తున్న శవాలు ఆ ఇద్దరు సైనికులవే అని అర్థం అయిన మరుక్షణం వాళ్ళ భయం రెట్టింపు అయ్యింది. ప్రజలు జయధ్వానాలు చేస్తూ వాళ్ళపైన విరుచుకుపడ్డారు.

ఇదంతా చూస్తున్న ఉగ్ర, మహాబసు ముఖంలో ఆనందం తాండవించింది. ఆచార్య వేదాంతం చిరునవ్వు నవ్వుతూ జరుగుతున్నదాన్ని చూస్తున్నాడు. ద్వీప సంతోషం పట్టలేక మహాబసు దగ్గరకు పరుగెత్తి అతని కుడి చేతిని అందుకోని పక్కనే నిలబడింది. కేవలం ఒక్క వ్యక్తి మాత్రం జరుగుతున్నది నచ్చనట్లు తల దించుకోని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. అతను పశుపాల.

★★★

వామదేవుడు అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఇన్నాళ్ళుగా తనకి వ్యతిరేకంగా ఉద్యమం మొదలౌతోందని తెలిసినా అది ధర్మపోరాటమనీ, ఆయుధం లేకుండా చేస్తున్నారని విని నవ్వుకున్నాడు. అది కూడా చేతులు దాటిపోతోందని తెలిసినప్పుడు తానే స్వయంగా పూనుకోని చేతికి అందిన నూటాఇరవైమందిని హతమార్చాడు. కానీ ఇప్పుడు వింటున్న వార్త వేరుగా వుంది. ఉద్యమకారులు మొదటిసారి సాయుధ పోరాటం చేస్తున్నారు. ఇరవై ఎనిమిది మంది సైనికులని చంపేశారు.

"ఆచార్య వేదాంతాన్ని పిలిపించండి" అంటూ ఆజ్ఞాపించాడు.

"మహాధినేతా! ఆచార్య వేదాంతం కూడా వారితో కలిసిపోయాడు. ప్రస్తుతం వారంతా నిశారణ్యంలోకి వెళ్ళిపోయారని వేగులు వార్తలు తెస్తున్నారు." అన్నాడు దళాధిపతి

"నిశారణ్యమా" అంటూ సింహాసనం పైన కూలబడ్డాడు వామదేవుడు. "అయితే ధర్మాధిపతి ఉదంతుణ్ణి పిలిపించండి" అన్నాడు. మరి కొంతసేపటికి ఉదంతుడు వచ్చి వామదేవుడి నమస్కరించాడు.

ఉదంతుడి రాజ్యంలో ధర్మ సంస్థాపనకు కృషి చేసే పదవిలో వున్నవాడు. మహాధినేతకు చిన్ననాటినుంచి ధర్మసంబంధమైన విషయాలను చెప్పినవాడు. అయినా వామదేవుడు అతనికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేదు. సింహాసనంలోనే కూర్చోని ఆయనను పక్కనే వున్న ఆసనం పైన కూర్చోమని సైగ చేశాడు.

"ఉదంతా... సవ్యలంకలో జరుగుతున్న అకృత్యాలు మీ దృష్టికి వచ్చే వుంటాయి. ధర్మాతిక్రమణ మితిమీరి పోతోంది. ఏం చెయ్యలో అర్థం కావటంలేదు... మీ సలహా కోరి పిలిపించాను" అన్నాడు.

ఉదంతుడు కొద్ది క్షణాలు తటపటాయించాడు. తన పూర్వీకులలో ముత్తాతలు, తాతలు వామదేవుడి ముత్తాతల తాతల ఆస్థానంలో పని చేసేవారు. మహాధినేత స్థానంలో వున్న వామదేవుడి పూర్వీకులంతా వారి సలహాలతోనే ఏ నిర్ణయమైన చేసే వాళ్ళని ఉదంతుడి అతని తాత చెప్పగా విన్నాడు. ఆ తరువాత వాళ్ళ స్థానం తగ్గిపోయింది. కేవలం దేవాలయ అర్చకులుగా మిగిలిపోయారు. ఇప్పుడు కొత్తగా పిలిచి సలహా అడగటం వింతగానూ, ఆశ్చర్యకరంగానూ అనిపించిందతనికి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు వామదేవుడు హూంకరిస్తున్నాట్లు.

"సభకి ఆచార్యులు ఎవరైనా వస్తారేమోనని"

"ఆచార్యుల సలహా పాటించే అవకాశమే వుంటే మిమ్మల్ని ఎందుకు పిలుస్తాను? జలపతి సంగతి మీకు తెలుసు, ఇప్పుడు వేదాంతం కూడా రాజ్యధిక్కారం చేసి వాళ్ళతో కలిసిపోయాడు" అంటూ పళ్ళు కొరికాడు వామదేవుడు. ఉదంతుడికి తనని ఎందుకు పిలిపించారో అర్థం అయ్యింది.

"ప్రభూ ఉద్యమం సంగతి నాకు తెలుసు. అయితే ఇప్పటి దాకా జరిగిన ఉద్యమానికి ఈ ఉద్యమానికీ చాలా తేడా వుంది. ఇంతకు ముందు ఉగ్ర నాయకత్వంలో జరిగిన పోరాటంలో కేవలం ధర్మాధికారులు, ఆచార్యులను మాత్రమే చంపేవారు. ఇప్పుడు మహాబసు నాయకత్వం వచ్చాక అసలు ఎవరినీ చంపకుండా కొంత పోరాటం చేశారు. ఆ తరువాత మీరు స్వయంగా వారిలో కొందరిని

హతమార్చడంతో సాయుధపోరాటానికి మారారు. ఇప్పుడు వాళ్ళు చంపుతున్నది ధర్మాధికారుల్ని కాదు. కేవలం సైనికుల్ని, దళాధిపతి మనుషుల్ని చంపుతున్నారు. అందువల్ల..."

"అందువల్ల..??"

"ఈ ఉద్యమ స్వరూపమేమిటో, ఈ మార్పుకు కారణం ఏమిటో తెలుసుకోవాలి. అందుకు అనుగుణంగా మన ప్రణాలిక వుండాలి. మీరు అనుమతిస్తే..."

"ఏం చేస్తారు?"

"నేనే స్వయంగా వెళ్ళి వారితో కలిసిపోతాను. వాళ్ళ ఆలోచనల వెనుక వుండే సిద్ధాంతమేమిటో, వారి ఆశయం ఏమిటో తెలుసుకోని తిరిగి వస్తాను. మీకు సర్వం నివేదిస్తాను." అన్నాడు.

ఆ ఆలోచన వింటూనే వామదేవుడు సంతోషించాడు.

"భళా... మీ ఆలోచన బాగుంది. ధర్మాధికారుల్ని చంపటం లేదు కాబట్టి మీరు వారికి అనుకూలంగా మారారని వాళ్ళు అనుకుంటారు. వేదాంతం అక్కడే వున్నాడు కాబట్టి మీకు వారిలో కలిసిపోవటం అంత కష్టం కాదు. భేష్... వెంటనే బయల్దేరండి" అన్నాడు వామదేవుడు.

"అవశ్యం మహాధినేతా... ఇంతకీ వాళ్ళు ఎక్కడ వున్నారో ఏమైనా తెలిసిందా?" ఉదంతుడు అడిగాడు.

"నిశారణ్యం"

"నిశారణ్యమా?" ఆశ్చర్యపోయాడు ఉదంతుడు.

★★★

"నిశారణ్యమంటే చాలా దట్టమైన అడవుల సమూహం. ఇక్కడ అనేక ప్రాకృతిక గుహలు ఉద్యమానికి అవసరమైన రహస్య స్థావరాలకు అనుకూలంగా వుంటాయి. అందుకే ఇక్కడికి తీసుకొచ్చాను." చెప్పాడు ఉగ్ర.

"మీ పోరాటం ఇక్కడ్నుంచే సాగిందా?" అడిగింది ద్వీప.

"మేము ఇంత దూరం రాలేదు. దక్షిణ దిక్కుగా వున్న చింతారణ్యాలలో వుండేవాళ్ళం. ఇప్పుడు మన సంఖ్య పెరిగింది. మన మీద ప్రభుత్వానికి కన్నెర్రగా వుంది. అందువల్ల అంతకన్నా సురక్షితమైన ప్రాంతంలో వుండటం అవసరం అనిపించింది." చెప్పాడు ఉగ్ర.

"మనకి సరే... ఈ వయసులో ఆచార్య వేదాంతం ఇంత కష్టపడటం నాకు ఇబ్బందిగా వుంది" అన్నాడు మహాబసు. ఆచార్య వేదాంతం చిన్నగా నవ్వాడు.

"నేను మీకు అనుకూలంగా వున్నానని మహాధినేతకు నేడో రేపో తెలిసిపోతుంది. ఆ తరువాత నా ప్రాణాన్ని తీసుకోవాలన్న ఆలోచనే చేస్తాడు. ఒక వేళ తెలియకపోయినా నన్ను పిలిపించి సలహా తీసుకోవాలనుకుంటాడు. అప్పుడైనా నా ఆలోచన మీకు అనుకూలంగా వుందని తెలుసుకుంటాడు."

"అవును వేదాంతం గారు ప్రాణాలతో వుండాలంటే మనతో వుండటమే సమంజసం" అంది ద్వీప. ఆయన మళ్ళీ నవ్వాడు.

"వయసుమళ్ళిన వాడిని. నాకు ప్రాణాలమీద అంత తీపి లేదు. కానీ నేను బ్రతికి వుండటం మీకందరికీ అవసరం. నా ఉపయోగమేమిటో ముందు ముందు మీకే తెలుస్తుంది" అన్నాడు.

ఉగ్ర ఏదో అడగబోయి ఆగిపోయాడు. మహాబసు గుర్రం దిగడంతో అతని నోట్లో మాటలు అక్కడే ఆగిపోయాయి. మహాబసు ఎదురుగా ఒక మూడడుగుల ఎత్తు వున్న చిన్న మందిరం వుంది. దాని ముందు దిగిన మహాబసు ఆ మందిరాన్ని పరిశీలనగా చూసి ఉగ్ర వైపు తిరిగాడు.

"ఏమిటిది?" అడిగాడు.

"అది రణచండి మందిరం. ఈ నిశారణ్య అడవుల్లో వుండే ఆటవికులకి ఆమె ఆరాధ్య దైవం. ఇలాంటివి ఈ అడవిలో కొన్ని వందలు వున్నాయి. ఎప్పటివో, ఎవరు కట్టించారో, ఎందుకు కట్టించారో తెలియదు" అన్నాడు ఉగ్ర.

మహాబసు ముందుకు వంగి, కొంత కష్టపడుతూ ఆ మందిరం లోపలికి వెళ్ళాడు. అతనితో పాటు అక్కడికి వచ్చినవాళ్ళంతా గుర్రాలను దిగారు. ఒకసారి ఒకరికి మించి లోపలికి వెళ్ళే అవకాశం లేని మందిరం అది. మరికొద్ది సేపటిలో మహాబసు బయటికి వచ్చాడు. అతని ముఖంలో ఆశ్చర్యం ప్రస్ఫుటంగా కనపడుతోంది.

"మీలో ఎవరైనా ఇలాంటి మందిరంలోకి వెళ్ళారా?" అన్నాడు.

"లేదు... బయట నుంచి చూడటమే. ఆటవికులు వెళ్తారు. ఏం?" అన్నాడు ఉగ్ర.

"లోపల విగ్రహం చూడండి. ఆమె కుడి చేతితో ఆశీర్వదిస్తోంది" అన్నాడు ఉత్సాహంగా. అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"అవును రణచండి కుడిచేతి వాటం వున్న దేవత" అన్నాడు ఆచార్య వేదాంతం.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS